

దారిలో ముళ్లను దాటుకుంటూ వెళ్లేవాడు విజేత అవుతాడు.. అదే దారిలో ముళ్లను తీసేస్తూ వెళ్లేవాడు నాయకుడు అవుతాడు.. అవును.. పది మందితో నడిస్తే నాయకులు కాలేరు.. తెగువ చూపించి ఆ పది మందికి మంచి చేస్తేనే నాయకులవుతారు.. సమస్యలొస్తే రానీ, సవాళ్లు ఎదురైతే ఎదురవనీ, ఓటమి తలుపు తడితే తట్టనీ, నిలుద్దాం, పోరాడదాం.. గెలుద్దాం అని చెప్పిన స్వామి వివేకానందుని మాటలు ఆ నాయకునితో కలిసి నడిచిన వారికి ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. చరిత్ర సృష్టించేవాడు మాటలు చెప్పడు.. చేతలతో చేసి చూపిస్తాడు. ఒక్కడిగానే వస్తాడు.. ప్రజల గుండెల్లో నిలుస్తాడు.. చరిత్ర సృష్టించే తీరుతాడు.. ఇదిగో ఈ మాటలు ఇలాంటి నాయకుల పనితీరును బట్టే రాసుంటారు.. ఇంతకీ ఇన్ని సుగుణాలున్న ఆ నాయకుడెవరనేగా మీ సందేహం. ఆయనే తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి. ఇటీవల లచ్చిరెడ్డి తన ఉద్యోగుల కుటుంబాల కోసం ఎంతోకృషి చేస్తున్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలో ఏ మండలంలో ఎక్కడ ఎవరికి సమస్య వచ్చినా రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారు. ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకుని అలుపెరగని ఉద్యమ యాత్ర సాగిస్తున్నారు. అందుకే రోజురోజుకూ లచ్చిరెడ్డికి ఉద్యోగులనుండి అన్ని వర్గాల వారి నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్

# ది లీడర్ లచ్చన్న





- ఆరడుగుల పట్టుదల.. ఇంచు కూడా చలించని ఏకాగ్రత
- ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ప్రతినిధి
- ఎక్కడ ఎవరికి కష్టం వచ్చినా క్షణాల్లో స్పందించే గుణం
- గతంలో ఇలాంటి నాయకుని చూడ లేదంటున్న ఉద్యోగులు

**ఆరడుగుల పట్టుదల..**

చురుకైన చూపులు.. జలపాతంలాంటి గంభీరమైన స్వరం..ఆరడుగుల పట్టుదల..ఇంచు కూడా చలించని ఏకాగ్రత.. ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ప్రతినిధిగా లచ్చిరెడ్డిని ఉద్యోగులు ప్రశంసిస్తున్నారు. ఎక్కడ ఎవరికి కష్టం వచ్చినా క్షణాల్లో స్పందించే గుణం ఉన్న నాయకునిగా ఎంత వరకైనా వెళ్లి తమ ఉద్యోగులను కాపాడుకునే నైజం ఆయన సొంతం. స్వతహాగా పోరాట స్ఫూర్తిని తనువంతా నింపుకున్న లచ్చి రెడ్డి తాజాగా వరంగల్ జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్ అన్నెబోయిన రాజేష్ ఖన్నా కుటుంబానికి అండగా నిలిచిన తీరు ఉద్యోగ సంఘాల్లోనే కాదు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నుండి సైతం అభినందనలు వెల్లువలా అందుతున్నాయి. చూడటానికి సన్నగా రివటలా ఉన్నా.. ఆ బక్కపలుచని వ్యక్తి వెనుక మహా మనసున్న మనిషి, ప్రేమను పంచే విలువైన సిద్ధాంత గ్రంథంలా ఉంటాడు. అందుకే ఆయనను ఉద్యోగుల ఆత్మ గౌరవం అని పిలుచుకుంటారు.

**ఉద్యోగి పాడె మోసి అసలైన దార్శనికుడు లచ్చిరెడ్డి..**

వరంగల్ జిల్లా పెద్ద నల్లబెల్లి డిప్యూటీ తహసీల్దార్ రెండు రోజుల కిందట చనిపోయిన విషయం తెలిసిందే. కాగా

ఆయన మృతి వార్త తెలుసుకున్న లచ్చిరెడ్డి హుటాహుటిన హైదరాబాద్‌నుండి వరంగల్‌లోని రాజేష్ నివాసానికి చేరుకుని పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. జేఏసీ చైర్మన్ లచ్చన్న వస్తున్నాడన్న సమాచారం అందుకున్న అనేక మంది రెవెన్యూ ఉద్యోగులు రాజేష్ కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు తరలిరావడం ఆ కుటుంబానికి కొంత గుండె ధైర్యం అందించినట్టు అయిందని పలువురు చర్చించుకున్నారు. అంతేకాదు రాజేష్ పాడె మోసి ఆ కుటుంబానికి తాము వెన్నుదన్నుగా ఉన్నామన్న సంకేతం అందించిన లచ్చిరెడ్డికి అక్కడున్న వందలాది మంది ప్రశంసలు కురిపించారు. ఉద్యోగి కుటుంబానికి ఒక నాయకుడు ఎంతలా అండగా ఉంటాడో నిరూపించి చూపించాడు.

అంతకు ముందే రాజేష్ కుటుంబం హాస్పిటల్ బిల్లులు కట్టలేక తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నట్టుగా రాజేష్ సతీమణి రమాదేవి పంపిన వీడియో సందేశం విని తక్షణమే స్పందించిన లచ్చన్న హాస్పిటల్ వద్దకు వెళ్లి మేనేజ్ మెంట్‌తో మాట్లాడి ఏకంగా ఏడు లక్షల మెడికల్ బిల్లును రద్దు చేయించి రాష్ట్రంలోనే సంచలనం సృష్టించారు. అంతేకాకుండా తెలంగాణ ఉద్యోగులకు రావాల్సిన పెండిరగ్ బిల్లుల చెల్లింపుకోసం, 317జీవోతో సతమతమౌతున్న వారికి అండగా నిలిచారు. గత రెవెన్యూ



చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో మాతృసంస్థ నుండి దూరమై చెల్లాచెదురైన పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలకు మళ్లీ మాతృసంస్థ రెవెన్యూలోకి వచ్చేలా ప్రభుత్వాన్ని మెప్పించి ఏకంగా 10,954 మంది జీపీఓ పోస్టులను సృష్టించి ప్రభుత్వం పూర్వ వీఆర్వోల కుటుంబాల్లో వెలుగులు నింపేలా చేశారు. నిర్వీర్యమైన రెవెన్యూ వ్యవస్థకు కొత్త జవసత్వాలు తీసుకొచ్చారు. రెవెన్యూ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం సెలక్షన్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు(అదనపు కలెక్టర్లుగా) నియామకం చేపట్టడంలో ఉద్యోగుల పక్షాన అవిశ్రాంతంగా పోరాడారు. త్వరలోనే ఉద్యోగులకు నూతన ఆరోగ్య పథకం అమలు చేసేందుకు గాను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుభవార్త అందించడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగికి నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ



మంత్రికి జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి వివరించారు. ఇలా అనతి కాలంలోనే రాష్ట్ర ఉద్యోగులకు సంబంధించి అనేక సమస్యలను పరిష్కరించుకుని ఉద్యోగుల పక్షాన మరిన్ని విజయాలు నమోదు చేసేందుకు టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పెద్దలతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ నిజమైన ఉద్యోగ సంఘ నాయకునిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.







నిలువెల్లా నిరాశ నిండిన అభాగ్యులకు ఆమె ఆపన్న హస్తం.. ఏ ఆసరా లేని అనాథలకు ఆమె ఒక స్నేహగీతం.. ఓ కన్నీటి ధారిక, ఓ నిరుపేద వేదన, ఓ బాధితురాలి గుండెకోత.. భర్త లేని ఓ మహిళ ఆక్రందన.. మున్నేరు వరద బాధితులకు ఆమె ఆసరా.. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుకొచ్చి వారి పక్షాన నిలిచే సేవా స్ఫూర్తి.. మనసు బాధపడినపుడు అమ్మ కొంగులో దాచు కుంటాం.. గుండె చెదిరినపుడు ఆ బాధను పంచుకునే హృదయాన్ని కోరుకుంటాం.. ఇప్పుడు ఖమ్మం నగరంలో ఇలాంటి బాధితులు ఎందరో ఆమె సాయం కోరుతున్నారు. ఇలా ఒక్కరు కాదు ఇద్దరు కాదు వందల సంఖ్యలో బాధితులకు కొండంత అండగా నిలిచి వారిని సమస్యల సుడిగుండం నుండి గట్టెక్కించే క్రతువులో ఆమె ఇప్పుడు అందరి మనసులూ గెలుస్తోంది. ఆమె మరెవరో కాదు..కాంగ్రెస్ పార్టీ అభిమాని, సంఘసేవకురాలిగా గుర్తింపు పొందిన కొర్లపాటి అన్నపూర్ణ. సంపద ఎతున్నది అని కాదు..ఎంత మందికి ఆహారాన్ని పంచామన్నదే ముఖ్యమని భావించే మనసున్న మనిషి అన్నపూర్ణ గారి పుట్టిన రోజు(జూలై 01) సందర్భంగా కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం...

# చెదరని సంకల్పం

## కొర్లపాటి అన్నపూర్ణ..



**ఖమ్మం బ్యూరో కెరటం న్యూస్ ప్రతినిధి**

**చెదరని సంకల్పం..**

ఖమ్మం నగరానికి చెందిన కొర్లపాటి అన్నపూర్ణ తల్లిదండ్రులది సినీహీరో కృష్ణ గారి స్వగ్రామం బుర్రిపాలెం. స్వయానా హీరో కృష్ణ రక్త సంబంధీకులు కూడా. అన్నపూర్ణ తల్లిదండ్రులు ఘట్టమనేని రాఘవయ్య, విజయలక్ష్మి దంపతుల ఇద్దరు (అన్నపూర్ణ, శ్రీదేవి) సంతానంలో పెద్ద కుమార్తె అన్నపూర్ణ. నాడు అనుకోని పరిస్థితుల్లో తెలిసీ తెలియని వయసులోనే వివాహం చేసుకోవాల్సి రావడంతో చిన్నప్పుడే కుటుంబ బాధ్యతల్లోకి వెళ్లాల్సి వచ్చింది. ఖమ్మం నగరానికి సమీపంలోని వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొర్లపాటి జగన్మోహన్‌రావుతో వివాహం జరిగిన తరువాత అన్నపూర్ణ భర్త ప్రోత్సాహంతో 1996లో మైత్రి బ్యూటీ పార్లర్‌ను ప్రారంభించి అనేక మందికి తన సంస్థ ద్వారా సర్వీసు అందించి జిల్లాలోనే కాక ఉమ్మడి ఏపీలోనే ప్రత్యేక గుర్తింపును పొందారు. ఈక్రమంలో తన వద్ద బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునే వారికి సుమారు 2వేల మందికి పైగా బ్యూటీపార్లర్ కోర్సును నేర్పించి నిపుణులైన మహిళలను తయారు చేశారు. ప్రస్తుతం వారంతా అమెరికా, లండన్, దుబాయ్, సహా వివిధ దేశాలలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తూ గౌరవ ప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారు. అదే క్రమంలో శారీ రోలింగ్, డ్రైవాష్, పెయింటింగ్, తదితర కోర్సులు నేర్పించారు. ఈ క్రమంలోనే 2018లో ఆమె భర్త జగన్మోహన్‌రావు మరణించడంతో పాటు అప్పటికే అన్నపూర్ణ కొన్ని కారణాలతో మానసిక ఒత్తిడికి గురై అనారోగ్య సమస్యలతో సతమత మౌతున్నారు. అన్నపూర్ణకు కూతురు కొర్లపాటి అలేఖ్య ఉన్నారు. ఇదిలా ఉండగా భర్త మరణం తరువాత కొన్నేండ్ల పాటు ఇంటికే పరిమితమైన అన్నపూర్ణ తన వంతుగా సమాజానికి ఏదో సేవ చేయాలన్న తపనతో 2021లో

- అభాగ్యులకు మమతల పందిరి ఆమె
- కష్టాలు, కడగండ్లకు తల వంచని ధీర వనిత
- సమాజ హితం కోరి మానవత్వాన్ని పంచుతున్న సేవా స్ఫూర్తి
- పేదల కండ్లల్లో వెన్నెల పూలు పూయించేందుకు అహర్నిశలు కృషి
- ఖమ్మంలో అతిపెద్ద బ్యూటీ పార్లర్ పరిచయం చేసిన మేటి మహిళ
- బహుముఖ ప్రజ్ఞాశాలిగా మానవ సేవలో నిమగ్నం
- జిల్లాలో పలువురి ప్రశంసలు అందుకుంటున్న అన్నపూర్ణ

వివిధ రకాల సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

**పేదల కండ్లల్లో వెన్నెల పూలు పూయించేందుకు అహర్నిశలు కృషి**



కొర్లపాటి అన్నపూర్ణ తన సేవా కార్యక్రమాల ద్వారా ఇప్పటికే అనేక మందికి తన సేవలు విస్తరించింది. ముఖ్యంగా బాలికలపై దాడులను అరికట్టేందుకు గాను ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం, ఫోక్సో చట్టాలను గురించి అవగాహన కల్పించడం, బాలబాలికలకు విద్య గురించి ప్రాముఖ్యతను వివరించడం, విద్యార్థుల్లో డ్రగ్స్ మహమ్మారి గురించి అవగాహన కల్పించడం, డ్రగ్స్ వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించడం, తల్లిదండ్రులను, పెద్దలను ఎలా గౌరవించాలి, బాలికలకు హాస్టళ్లలో ఎదురయ్యే సమస్యలను వివరించడం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత, సమాజం పట్ల అవగాహన, ఈవ్‌టీజింగ్, తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడటం చిక్కులు కొనితెచ్చుకోవడం, ప్రేమ పేరుతో మోస పోవడం, అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు అవగాహన కల్పించడం, ఎయిడ్స్, క్యాన్సర్, తదితర ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పించడం, భర్త వేధింపులతో మానసిక క్షోభను ఎదుర్కొంటున్న వారికి అండగా నిలవడం, వృద్ధులకు, వికలాంగులకు చేయూతను అందించడం, తండాల్లో, పల్లెల్లో సమాజం పట్ల అవగాహన కల్పించడం, ట్రాన్స్ జెండర్లకు అవగాహన కల్పించడం, రోడ్ల వెంట, బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రదేశాల్లో దుస్తులు, దుప్పట్లు లేని వారికి ఆయా వస్తువులు పంపిణీ చేయడం, రాత్రి వేళ అన్నం లేని అభాగ్యులకు అన్నదానం చేయడం ఇలా నిత్యం ఏదో ఒక చోట తన సేవా కార్యక్రమాలకు తన సమయం కేటాయిస్తూ సమాజంలో తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. న్యాయ సేవా సాధికారత సంస్థతో కలిసి జిల్లా జడ్జి చంద్రశేఖర్ గారితో కలిసి వివిధ ప్రాంతాల్లో కోర్టులు, చట్టాలు, హక్కుల గురించి ప్రజలకు వివరించడం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం చేస్తున్నారు. జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గాలకు చెందిన వారికి తన సేవలు అందిస్తున్నారు. వైఎస్ఆర్ కాలనీ, కేసీఆర్ కాలనీల్లో ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధులపై అవగాహన, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయడం, అడవుల్లోని గిరిజనులకు అండగా నిలవడం, ముఖ్యంగా రఘునాథపాలెం మండలంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందడుగు వేస్తున్నారు.





**తుది శ్వాస వరకూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా..**

**కొర్లపాటి అన్నపూర్ణ, సంఘ సేవకురాలు**



ప్రతి రోజు మన కోసం మనం బతుకుతూ..సమాజంలోని అభాగ్యులకోసం మనం ఏం చేస్తున్నాం..అనే కోణంలో మనలను మనం ప్రశ్నించుకున్నప్పుడే నిజమైన మానవత్వానికి మార్గం దొరుకుతుందని కొర్లపాటి అన్నపూర్ణ అన్నారు. తాను నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపి నేడు సమాజ సేవలో తనకు ఇష్టమైన పాత్ర పోషిస్తున్నానని అన్నారు. మహిళా శక్తిని త్రికరణ శుద్ధిగా అందరికీ అందించాలన్న ఆశయంలో పనిచేస్తున్నానని ఆమె అన్నారు. పేదరికం, కష్టాల్లో ఉన్నవారి పట్ల జాలిదయ చూపుదామని అన్నారు. మానవత్వాన్ని తపస్సుశక్తిలా అందరికీ పంచుతానని అన్నారు. అందుకే ఎన్ని అవాంతరాలు ఎదురైనా సాహసాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. స్వతంత్ర ఆలోచనా విధానం, విలక్షణ వ్యక్తిత్వంతో ఎదుటి వారికి సేవ చేయాలన్నదే తపన అన్నారు. కాగా అన్నపూర్ణకు భరతనాట్యం, కూచిపూడి, తదితర నృత్యాల్లో మంచి నైపుణ్యం కలిగి ఉన్నారు. అనేక అంశాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు కలిగి ఉన్నారు. తన జీవిత అనుభవాలే నిజమైన పాఠాలుగా మలచి మానవత్వం పంచుతూ మనసున్న మహిళగా, హుమానిటీ క్వీన్‌గా పేరుతెచ్చుకున్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని కోరుకుందాం.